క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



శ్రీరాములను సత్కరిస్తున్న ఆలయ పాలకమండలి సభ్యులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలోని శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి తిరుపతికి చెందిన వసంత శ్రీరాములు రూ. 50,116 విరాళం ఇచ్చారు. మంగళవారం నగదును ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను పాలకమండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

డాక్టరేట్ ప్రదానం



జయంతి



స్వర్ణ

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థినులు జయంతి, స్వర్ణ డాక్టరేట్ డిగ్రీ పట్టా అందుకున్నారు. డాక్టర్ పి.నీరజ పర్యవేక్షణలో 'నాలెడ్జ్ అండ్ ప్రాక్టీసెస్ రిలేటెడ్ టు రీప్రొడక్టివ్ హెల్త్ అమాంగ్ అడలసెంట్ గరల్స్: యాన్ ఇంటర్వెన్షనల్ స్టడీ ఇన్ హైదరాబాద్' అనే అంశంపై జయంతి.. అలాగే ప్రొఫెసర్ జయశ్రీ పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ ఆశాస్ ఇన్ అచీవింగ్ సస్టైనబుల్ డెవెలప్‌మెంట్ గోల్స్ రిలేటెడ్ టు విమెన్స్ హెల్త్ ఇన్ చిత్తూర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై స్వర్ణ పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు.

పాకాల ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన

పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) చెంగల్‌రెడ్డి, తిరుపతి డీఎం బాలాజి మంగళవారం పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో సీసీ ప్లాట్‌ఫాం పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనులు పూర్తయ్యే వరకు బస్సుల రాకపోకలు బస్టాండ్ ఆవరణానికి వెలుపల జరుగుతున్నాయన్నారు. త్వరలోనే పనులు పూర్తి అవుతాయని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. కంట్రోలర్ రవిచంద్ర, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్స్‌లో నేడు రక్తదాన శిబిరం

తిరుపతి తుడా: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్వీ యూనివర్సిటీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని కోరారు.

మురుగు నీటి కాల్వ సమస్యపై వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రెడ్డివారిపల్లి వాసులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం రెడ్డివారిపల్లెలో మురుగునీటి కాలువ సమస్యను పరిష్కరించాలని రెడ్డివారిపల్లి సర్పంచ్ రేవతిప్రకాష్ రెడ్డి, గ్రామస్తులు కోరారు. మంగళవారం తహసీల్దార్ శిరీషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కాలువ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ శిరీషా ప్రభుత్వ భూమిని సర్వే చేసి కాలువ నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు ఔరంగాజేబు, గ్రామస్తులు ప్రకాశ్ రెడ్డి, శిరీష్‌కుమార్, మోహన్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం

మైళ్లకొద్దీ దూరంలో అందుబాటులో లేని కార్యాలయాలు.. నెలలపాటు తమకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు.. లబ్ధిదారుడు వెళ్లినా అందుబాటులో లేని అధికారులు.. తమ పనులు ఆపుకుని కార్యాలయాల చుట్టూ వ్యయప్రయాసలు కోర్చి ప్రదక్షిణలు చేసినా ఫలితం శూన్యం. ఇదంతా గతం. వీటన్నింటికి ముగింపు పలుకుతూ పంచాయతీల్లోనే జగనన్న ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి పునాదులు వేసింది. ఫలితంగా ఇంటి ముంగిటకే అన్ని రకాల సేవలు అందుతున్నాయి.

- సచివాలయ వ్యవస్థతో గడప గడపకూ ప్రభుత్వ సేవలు
- గ్రామాల్లోనే అందుతున్న 540 సేవలు
- కష్టాలు తప్పాయని గ్రామీణుల ఆనందం



కుప్పంబాదూరు గ్రామ సచివాలయం

రామచంద్రాపురం: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలందించాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారమైంది. ప్రజలు సులభతరంగా ప్రభుత్వ సేవలు అందుకుంటున్నారు. కీలకమైన రెవెన్యూ సేవలతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు, పన్నుల చెల్లింపులు, సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు క్షేత్రస్థాయిలో కార్యదర్శులకు సహాయంగా నిలుస్తున్నారు.

సేవా కేంద్రాలుగా సచివాలయాలు

రామచంద్రాపురం మండలంలో 2 వేల జనాభాకు ఒకటి చొప్పున 11 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించి 11 మంది సిబ్బంది ఉన్నారు. సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా వ్యవహరిస్తుంటారు. భూ సమస్యల పరిష్కారానికి వీఆర్వో, సర్వేయర్లను నియమించడంతో రైతుకు సత్వర న్యాయం జరుగుతోంది. సచివాలయాల్లో 540 సేవలకు సంబంధించిన ఆన్‌లైన్ పనులను డిజిటల్ అసిస్టెంట్ అందిస్తుండడంతో ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గాయి. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వలంటీర్ల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పనిముట్లు అందించడానికి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించడంతో వ్యవసాయం సులభతరమైంది. పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు పాడి రైతులకు తెలియజేసేందుకు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ నిమగ్నమై ఉంటారు. నాడు–నేడు పనులు, గ్రామ అభివృద్ధి పనులతో పాటు జగనన్న ఇళ్లనిర్మాణాలను వేగవంతం చేయడానికి ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, శాంతిభద్రతలు, విద్యుత్ సమస్యలు తీర్చడానికి మహిళా పోలీస్, ఎనర్జీ అసిస్టెంట్‌లను ఏర్పాటు చేయడంతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన వచ్చింది.

కార్యాలయాల చుట్టూ తిరిగేబాధ తప్పింది



గతంలో పనులు మానుకుని మైళ్లకొద్ది ఉన్న కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి ఉండేది. సచివాలయం అందుబాటులోకి రావడంతో గ్రామంలో అన్ని పనులు చేసుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది.

– గోవర్ధన్, అనుప్పల్లి

భూసమస్యలకు సత్వర పరిష్కారం



ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా కొన్ని సమస్యలు పరిష్కారమయ్యేవి కావు. స్థానికంగా సచివాలయంలోనే వీఆర్వో, సర్వేయర్ అందుబాటులో ఉండడంతో సత్వర న్యాయం జరుగుతోంది.

– శంకరయ్య, నెత్తకుప్పం

ఇంటి ముంగిటకే సేవలు



సచివాలయాల ఏర్పాటుతో అన్ని రకాల ప్రభుత్వ సేవలు త్వరితగతిన గ్రామంలోనే లభిస్తున్నాయి. గతంలో మండల కేంద్రానికి వ్యయప్రయాసకోర్చి వెళ్లినా ఆ రోజు పని అయ్యేది కాదు. ఇప్పుడు సచివాలయంలో రెవెన్యూ సేవలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పన్నుల చెల్లింపులు, పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి.

– విజయకుమార్, ఒడ్డుకాలువ

అమ్మవారి సేవలో ప్రముఖులు



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



పంచాయతీ రాజ్ కమిషనర్ సూర్యకుమారి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ సూర్య కుమారి వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. వారి వెంట పంచాయతీరాజ్ అధికారి ఆదెం రాజశేఖర్ రెడ్డి, ఆలయ ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ మధు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

శెట్టిపల్లి అభివృద్ధికి కృషి

తిరుపతి మంగళం: శెట్టిపల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి అన్నారు. మంగళవారం శెట్టిపల్లి గ్రామంలో రైతులు, గ్రామస్తులతో శెట్టిపల్లి అభివృద్ధిపై ముఖాముఖి నిర్వహించారు. శెట్టిపల్లి విలీన ప్రక్రియలో ఎలాంటి మార్పులు ఉండబోవని, ప్రభుత్వ ఆర్డర్‌లో పొందుపరిచిన విధానంతోనే రైతులకు, ఇళ్ల స్థలాల కొనుగోలుదారులకు రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి స్థలాలను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు.

ఆహార భద్రత.. మీ బాధ్యత

- ఎస్వీ వ్యవసాయ కళాశాల వార్షికోత్సవంలో కమిషనర్ హరిత



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి ఎడ్యుకేషన్: సమాజంలో వ్యవసాయ రంగానిదే అగ్రస్థానమని, ఈ రంగంలో సాంకేతికత మరింత అభివృద్ధి చెంది ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ విద్యార్థులపై ఉందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత అన్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో మంగళవారం జరిగిన వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. తిరుపతి వ్యవసాయ కళాశాలకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న వారిలో పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతో పాటు గ్రూప్–1 స్థాయి అధికారులు సమాజానికి సేవలందిస్తుండడం ఈ కళాశాలకు గర్వకారణమని తెలిపారు.

మరింత మంది ప్రజా సేవకులు, రైతు సేవకులు ఈ కళాశాల నుంచి సమాజంలోకి రావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆహార పదార్థాల్లో రసాయనాలు అధిక మోతాదులో ఉన్నాయంటూ వస్తున్న హెచ్చరికల నేపథ్యంలో ప్రజా ఆరోగ్య దృష్ట్యా ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యం ఉందన్నారు. దీని కోసం శాస్త్రవేత్తలు శాస్త్రీయంగా రసాయన రహిత ఆహార ధాన్యాలు, కూరగాయలను సమాజానికి అందించేలా కృషి చేయాలని కోరారు.

- ఏడీఆర్ జె.వెంకటరావు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి వ్యవసాయ విద్యార్థులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు చేస్తున్న కృషితో నేడు వ్యవసాయ రంగంలో మనం రాణిస్తున్నామని తెలిపారు. కలుషితం లేని ఆహార ఉత్పత్తుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఆ దిశగా నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు ఫలితాలు రాబట్టాలని కోరారు. వార్షికోత్సవం సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ పి.సుధాకర్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జి.ప్రభాకరరెడ్డి, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ సి.రమణ, విద్యార్థి వ్యవహారాల అధికారి కేవీ. హరిప్రసాద్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు



తిరుపతి లక్ష్మీపురం సర్కిల్ వద్ద పనులను పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: నగరంలో అంతర్గత రోడ్లకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేయనున్నట్లు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి అన్నారు. లక్ష్మీపురం కూడలిలో యూడీఎస్ ఆధునీకరణ, బీటీ రోడ్డుతో పాటు ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కాలేజీ ఇంటర్నల్ రోడ్డు పనులను డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబుతో కలిసి మంగళవారం పరిశీలించారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. అలానే ప్రజారవాణా మెరుగుపరిచేందుకు ఇప్పటికే 7 ప్రాంతాల్లో కూడళ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ పనులు దాదాపు పూర్తి అవుతుండడంతో నగరంలోని ఇంటర్నల్ రోడ్లన్నీ అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. దశలవారీగా పూర్తిచేస్తామని తెలిపారు. రుయా–అన్నారావు కూడళ్ల మధ్య బీటీ రోడ్డు పనులు పూర్తిచేసినట్లు చెప్పారు. అలానే 50 డివిజన్‌లలోని రోడ్లను మరో ఐదారు నెలల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్స్‌తో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎంఈ చంద్రశేఖర్, డీఈ సంజీవ్‌కుమార్, కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ అమరానాథరెడ్డి, అంకాళమ్మ గుడి చైర్మన్ లక్ష్మయ్య, ఎస్‌కే.జానీ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా డే వేడుకల్లో మాట్లాడుతున్న చంద్రమౌళిరెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఆరోగ్యంగా ఉండాలంటే నిత్య జీవితంలో యోగా భాగం కావాలని చంద్రగిరి సింగిల్ విండో చైర్మన్ చంద్రమౌళిరెడ్డి అన్నారు. చంద్రగిరి మండలం తొండవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ యోగా డే నిర్వహించారు. విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ప్రతి మనిషి యోగా చేయడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే యోగా అలవర్చుకుంటే జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్కృత విద్యాపీఠ్ యోగా విభాగం ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం సుజాత, హేమ శేఖర్, శివకుమార్ పాల్గొన్నారు.

రుయాలో నేడు రక్తదాతల దినోత్సవం

తిరుపతి తుడా: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి రుయా ఆస్పత్రిలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శ్రీహరి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం మేరకు రక్తదాన శిబిరంలో ఈసారి వైద్యులు, వైద్యాధికారులు, వైద్యసిబ్బంది పాల్గొంటారన్నారు. ప్రజల నుంచే ఎప్పుడూ రక్తదానం చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని సరికొత్తగా నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందన్నారు. 18–65 ఏళ్లలోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. గత ఏడాదిలో 3 సార్లు కంటే ఎక్కువ రక్తదానం చేసిన మహిళలను సత్కరించనున్నట్లు చెప్పారు. అలానే ఇప్పటి వరకు 25 కంటే ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారిని సత్కరించి సర్టిఫికెట్లు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అరుదైన బ్లడ్‌గ్రూప్ దాతలను సత్కరించడమే ఈ ఏడాది రక్తదాతల దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు.

పెళ్లి కానుక పంపిణీ





సాయినగర్‌లో పెళ్లికానుక అందిస్తున్న సర్పంచ్ డీవీ రమణ, అగరాలలో..

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సాయినగర్ పంచాయతీలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందజేసిన పెళ్లి కానుకను సర్పంచ్ డీవీ రమణ, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములురెడ్డి పంపిణీ చేశారు. నూతన జంట చంద్రకుమార్, కృష్ణప్రియ పెళ్లి నేపథ్యంలో మంగళవారం సాయంత్రం వారి ఇంటి వెళ్లి కానుక అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరి(తిరుపతి రూరల్): అగరాల పంచాయతీలో వధువు మునిప్రియకు వైఎస్సార్‌సీపీ చంద్రగిరి దక్షిణ మండలం అధ్యక్షుడు దేవారెడ్డి, అగరాల సర్పంచ్ భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా పెళ్లి కానుక అందించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ మహమ్మద్ షాహీర్, నాగేశ్వర్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డికి సత్కారం



విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న రమేష్

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డిని గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి రమేష్ దుశ్శాలువతో సత్కరించారు. విజయవాడలో మంగళవారం రాష్ట్రంలోని గ్రీవెన్స్‌సెల్ సమస్యల పరిష్కారంపై విజయసాయిరెడ్డి చర్చించారు. ఈ నేపథ్యంలో ఆయన్ను గ్రీవెన్స్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అంకిరెడ్డి నారాయణ మూర్తి, జోనల్ ఇన్‌చార్జ్ పోకల రామకృష్ణారెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి రమేష్ సత్కరించారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



కొటబైలులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి

భాకరాపేట: ప్రజారోగ్యానికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ, కొటబైలు పంచాయతీల్లో ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. నాలుగు సెంటర్లలో 1,800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలో 26 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 70 శాతం మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు.

వైద్య పరీక్షల రిపోర్టులు వచ్చిన తరువాత వలంటీర్లు ద్వారా ప్రతి ఒక్కరికీ వారి ఇంటికి చేరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేంద్రబాబు, ఈఓపీఆర్‌డీ మదనమోహనరాజు, సర్పంచ్‌లు కిశోర్‌కుమార్‌రెడ్డి, రెడ్డెమ్మ, ఎంపీటీసీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కోర్టు ఆవరణం.. వాహనాల దిగ్బంధం



కోర్టు ఆవరణలో ఎక్కడికక్కడ నిలిపివుంచిన వాహనాలు

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో ఎక్కడి వాహనాలు అక్కడ ఆగిపోవడంతో మంగళవారం న్యాయవాదులు, కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేసవి సెలవుల అనంతరం కోర్టులు ప్రారంభమయ్యాయి. కోర్టు ఆవరణ లోపల వాహనదారులు వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఎదురైంది. వాహనాలను క్రమపద్ధతిలో పెట్టించడానికి ట్రాఫిక్ పోలీసులు గానీ, న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాద సంఘ కార్యవర్గ సభ్యులు ఎవరూ పట్టించుకోకపోవడంతో తరచూ ఇలాగే జరుగుతున్నాయి. కోర్టు ఆవరణం నుంచి న్యాయమూర్తుల అతిథిగృహాల్లోకి వెళ్లే మార్గంలో కార్లను ఎక్కడపడితే అక్కడ నిలపడంతో ముందుగా నిలిపిన వ్యక్తులు తమ కార్లను బయటకు తీయడానికి ఇబ్బందులు పడ్డారు. అధికారులు కోర్టు ఆవరణలోని ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించాలని న్యాయవాదులు, కక్షిదారులు కోరుతున్నారు.